Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్: 9440815774

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 111 | Sunday 30.03.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 111 | ఆదివారం 30. 03. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

## పార్టీకి మనం అందరం...

# వారసులం..






### నేను టీమ్ లీడర్ మాత్రమే అన్న చంద్రబాబు

### టీడీపీని లేకుండా చేయాలనుకున్న వారు కాలగర్భంలో కలిసిపోయారు: చంద్రబాబు

### మార్చి 29 టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం

### మంగళగిరి ఎన్టీఆర్ భవన్ లో వేడుకలు

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** నేడు (మార్చి 29) తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జాతీయ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ శ్రేణులకు ప్రత్యేక సందేశం వెలువరించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో జరిగిన వేడుకలకు చంద్రబాబు హాజరయ్యారు. చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర హెూంమంత్రి అనిత, ఇతర నేతలు పార్టీ జెండాను ఎగురవేసి, ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ... ఒక మహనీయుడి విజన్ కు ప్రతిరూపమే తెలుగుదేశం పార్టీ అని అభివర్ణించారు. ఒక ఆదర్శం కోసం పుట్టిన పార్టీ టీడీపీ... పార్టీ పెట్టిన 9 నెలలకే అధికారం దక్కించుకున్న ఏకైక పార్టీ టీడీపీ అని పేర్కొన్నారు. అనేక విప్లవాత్మక పథకాలతో పేదల సంక్షేమానికి నాంది పలికిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అటువంటి చారిత్రాత్మక పార్టీకి మనందరం వారసులం... నేను టీమ్ లీడర్ ను మాత్రమే మిగతా 2 లో

## తెలుగు ప్రజలకు...

# ఉగాది శుభాకాంక్షలు

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** నేడు తెలుగు సంవత్సరాది ఉగాది. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. మన ముంగిళ్ళకు వచ్చిన ఉగాది తెలుగువారి వారసత్వపు పండుగ అని అభివర్ణించారు. పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కళలు... జాతిని సజీవంగా నిలుపుతాయని తెలిపారు. ఉగాది పండుగ ఈసారి విశ్వావసు అనే గంధర్వుడి పేరిట వచ్చిందని, ఈ ఉగాది పండుగకు తెలుగు ప్రజలందరికీ హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని మిగతా 2 లో

## బడుగు, బలహీన వర్గాలకు...

# సముచిత స్థానం..

### రామ్మోహన్ నాయుడు కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని.. కూటమి ప్రభుత్వ ఆలోచనలు ప్రజలకు వివరించాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు సీఎం చంద్రబాబు టీడీపీలో సముచిత స్థానం కల్పించారని ఉద్ఘాటించారు. దేశంలో చరిత్రలో నిలిచిపోయేలా కోటి మంది సభ్యత్వాలతో నడుస్తున్నది అంటే దానికి కారణం యువనేత లోకేష్ అని తెలిపారు. దేశ చరిత్రలో ఎన్నో పార్టీ వచ్చాయని.. పోయాయి మిగతా 2 లో

## ప్రజాసేవే పరమావధిగా...

# ఎన్టీఆర్ ట్రస్ట్

### బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ పాటుపడ్డారు

### ఎన్టీఆర్ స్ఫూర్తితో పేదరికం లేని సమాజమే సీఎం చంద్రబాబు లక్ష్యం

### మహిళలు తమలోని శక్తిని గ్రహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారు

### 4వ రోజు కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి వెల్లడి

కుప్పం, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఎన్టీఆర్ పేదల పక్షపాతి అని ఆయన స్ఫూర్తితో పేదరికం లేని సమాజం కోసం సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని నారా భువనేశ్వరి అన్నారు. సామాజిక న్యాయం కోసం ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారని, ఆయన అడుగుజాడల్లో సీఎం చంద్రబాబు పయనిస్తున్నారని అన్నారు. 4వ రోజు కుప్పం పర్యటనలో భాగంగా మిగతా 2 లో



## వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును మతం కోణంలో...

# చూడవద్దు

### ఒవైసీ లాంటి వాళ్లు 100 మంది వచ్చినా....ఆ బిల్లు ఆగదు: బండి సంజయ్

### త్వరలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందుతుందన్న బండి సంజయ్

### ముస్లిం సమాజం, మేధావులు ఈ బిల్లుకు మద్దతు తెలుపుతున్నారు

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఒవైసీ వంటి వారు వంద మంది వచ్చినా వక్ఫ్ బోర్డు సవ రణ బిల్లును ఆపలేరని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఒవైసీ తాత వచ్చినా ఈ బిల్లు ఆగదని ఆయన స్ప ష్టం చేశారు. దేశంలోని ముస్లిం సమాజం, మేధావులు వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఒక్క ఒవైసీ వస్తే బిల్లు ఆగుతుందా అని ఆయన ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకువస్తామని చెప్పినప్పుడు తనకు కరీంనగర్‌లోని పేదవాడు గుర్తుకు వచ్చాడని ఆయన అన్నారు. కరీంనగర్ జిల్లా కోర్టు కాంప్లెక్సులోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం కేంద్ర సహాయ మంత్రి రూ. 15 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆయనను సన్మానించారు. అన మిగతా 2 లో



## పార్టీలో యువరక్తం నింపేందుకు...

# సహకరించాలి

### సంక్షేమ సారథి ఎన్టీఆర్... అభివృద్ధి ప్రదాత చంద్రన్న: మంత్రి నారా లోకేశ్

### టీడీపీ ఆవిర్భావ సభలో మాట్లాడిన ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

### కార్యకర్త గుర్తింపు కోసం ఇంటా, బయటా పోరాడతానన్న లోకేశ్

### పనిచేసే వారికే పదవులు ఇవ్వాలన్నది పార్టీ విధానమని వెల్లడి

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** పసుపు జెండా మనకు ఎమోషన్... 43 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో విజయాలు చూశాం. మరెన్నో సంక్షోభాలు ఎదుర్కొన్నాం. ఎన్ని కష్టాలు వచ్చినా ఎత్తిన పసుపు జెండా దించని కేడర్ మనకు మాత్రమే సొంతమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, మిగతా 2 లో



## కార్యకర్తలే పార్టీకి...

# బలం, బలగం: అనిత

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** నీతి, నిజాయతీలకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని పొలిట్ బ్యూరో సభ్యులు, హెూంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హెూంమంత్రి మాట్లాడుతూ.. జై తెలుగుదేశం... ఈ నినాదంతో నీతి, నిజాయితీ గల తెలుగుదేశం పార్టీ కార్యకర్త గుండెలు ఉప్పొంగుతాయని.. అవినీతి పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి, తెలుగు జాతి ఆత్మ గౌరవ నినాదంతో పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అని.. తెలుగుదేశం మిగతా 2 లో



## ఆర్థిక సమృద్ధికి పెట్టింది పేరు...

# విశ్వావసు నామ సంవత్సరం

**ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించే తెలుగు సంవత్సరాది**
**యువతకు భక్తినేర్పరిచే విశ్వావసు**
**విశ్వావసు తెలుగు సంవత్సర ప్రాముఖ్యతను తెలిపిన ప్రముఖ జ్యోతిష్య పండితులు చక్రధర సిద్ధాంతి**



తిరుపతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ ::** ఆర్థిక సమృద్ధికి పెట్టింది పేరు విశ్వావసు నామ తెలుగు సంవత్సరమని వెల్లడించారు. రాష్ట్ర నంది అవార్డు గ్రహీత, జ్యోతిష్య చక్రవర్తి, ప్రముఖ జ్యోతిష్య పండితులు, దైవాజ్ఞ రత్న డాక్టర్ చక్రధర సిద్ధాంతి. తెలుగు సంవత్సరాది ఉగాది నేపథ్యంలో విశ్వావసు నామ సంవత్సర విశేషాలను ఆయన శనివారం తెలుగు ప్రజలకు తెలియజేసారు. విశ్వానికి ప్రతిరూపం శ్రీ విశ్వాస నామ సంవత్సరమని చెప్పిన చక్రధర్ సిద్ధాంతి..., ముందుగా తెలుగు ప్రజలందరికీ.., శ్రీ విశ్వాస నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ విశ్వావసు అంటే అష్ట వసూలు ఈ భూమి మీదకు వచ్చిన దినమని పేర్కొన్నారు. ఉగస్య ఆది అనేదే ఉగాదని,.., "ఉగ" అనగా నక్షత్ర గమనం – జన్మ – ప్రపంచం జన్మ ఆయుష్షులకు మొదటిరోజు కనుక ఉగాది అయిందన్నారు చక్రధర సిద్ధాంతి. ఇంకొకవిధంగా చెప్పాలంటే, 'యుగం' అనగా రెండు లేక జంట అని కూడా అర్థం వస్తుందని.., ఉత్తరాయణ, దక్షిణాయనములనబడే.. ద్వయ సంయుతం 'యుగం' కాగా, ఆ యుగానికి ఆది యుగాది అయిందనీ..., అదే ఉగాది గాను, తెలుగు సంవత్సరాదిగా ప్రాచుర్యం పొందని వివరించారు. పురాణాల ప్రకారం, ఛైత్ర మాసం శుక్ల పక్షం శుద్ధ పాడ్యమి తిథి నాడు అంటే ఉగాది రోజున సృష్టి ప్రారంభమైనట్లు పండితులు చెబుతారనీ.. వేదాలను తస్కరించిన సోమకుడిని హతమార్చి మత్స్యావతారంలో ఉండే విష్ణువు వేదాలను బ్రహ్మ దేవుడికి అప్పగించిన శుభ తరుణ పురస్కారంగా విష్ణువు ప్రీత్యర్థం "ఉగాది"ఆచరణలోకి వచ్చిందని..,. ఛైత్ర శుక్ల పాడ్యమి తిథి నాడే ఈ విశాల ప్రపంచాన్ని బ్రహ్మదేవుడు సృష్టించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోందనీ,. అందుకే సృష్టి ఆరంభానికి సంకేతంగా ఉగాది పండుగను జరుపుకుంటారని వివరించారు. యుగ ప్రారంభానికి నాంది పలికిన రోజు ఉగాది కనుకనే...ఈ రోజున పంచాంగ శ్రవణం చేయడం వల్ల సకల శుభాలను చేకూరుస్తుందని తెలియజేశారు. తెలుగు సంవత్సరాది రోజున ఉగాది పచ్చడికి ప్రత్యేక స్థానం ఉందని చెప్పిన చక్రధర్ సిద్ధాంతి.., షడ్రుచుల కలయికే ఉగాది పచ్చడికి ప్రతిరూపమన్నారు. మానవ జీవితం కూడా షడ్రుచులతో మిళితమై ఉంటుందన్నారు. తెలుగు వారి క్యాలెండర్ ఉగాది నుంచి ప్రారంభం అవుతుందనీ..., ఈ తెలుగు నూతన సంవత్సరం మొదటి రోజుని ఉగాదిగా జరుపుకుంటామన్నారు. దీనికి కారణం ప్రకృతి సహజత్వమనీ.., మనిషి ప్రకృతికి, కాలానికి అనుగుణంగా జీవిస్తున్నాడని చెప్పారు. కనుక ప్రకృతి నూతనంగా మారినప్పుడు.. మనిషి జీవన విధానం కూడా నూతనంగా మొదలవుతుందనీ తెలియజేశారు. హిందూ పంచాంగం ప్రకారం ఒకొక్క తెలుగు సంవత్సరానికి ఒకొక్క పేరు ఉంటుంది. ఈ ఏడాది ఉగాది పేరు విశ్వావసు నామ సంవత్సరమనీ చక్రధర సిద్ధాంతి వెల్లడించారు. మార్చి 30 వ తేదీ ఆదివారం పాడ్యమి తిథి నుంచి ఈ విశ్వవాసు సంవత్సర మొదలు కానున్న నేపథ్యంలో ఈ ఏడాది మనిషి జీవితం ఎలా సాగనుంది..,ఆదాయ, వ్యయాలు, కష్ట, సుఖాలు, వ్యాధులు వంటి అనేక విషయాలను తెలుసుకోవాలని భావిస్తామన్నారు. ఈ ఏడాదిలో మొక్కలు పెరుగుదల అంతంత మాత్రంగానే ఉంటుందనీ.,. దీంతో రైతులకు ఫలాలను కూడా మోస్తరు రేటుతో ఇస్తాయన్నారు. సంపద అధికంగా ఉండదు. అదే సమయంలో అసలు ఈ రోజు చేతిలో డబ్బులు లేవు అనే రోజు ఉండదని తెలిపారాయన. ఈ సంవత్సరంలో వర్షాలు అధికంగా పడవు లేదా కరువు కూడా ఏర్పడదన్నారు. అంటే వర్షాలు సమృద్ధిగానే కురుస్తాయన్నారు . దొంగతనం భయం పెరుగుతుందనీ,. కొత్త వ్యాధులు లేదా ప్రతిచోటా ఒకే వ్యాధి వ్యాపించడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దురాశతో నిండి ఉంటారనే విషయాన్ని సిద్ధాంతి బహిరంగపరిచారు. రాజకీయాల్లో కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు.. ముఖ్యంగా విశ్వావసు తెలుగు సంవత్సరం ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందిస్తుందనీ.., యువతకు భుక్తి మార్గాన్ని చూపిస్తుందని తెలిపారు. విశ్వావసు సంవత్సరం ఆదివారం రావడం వల్ల.., సూర్యుడు తన ఆధిపత్యాన్ని కొనసాగించే అవకాశం ఉందన్నారు.దీంతో ఎండలు కూడా మండే సందర్భం లేకపోలేదన్నారు. ఉగాది పండగ రేవతి నక్షత్రంతో ప్రారంభమవుతుందనీ..,ఈ నక్షత్రంలో ఏడాది ప్రారభం కావడం వలన ప్రజలు సౌమ్యంగా ఉంటారని చెప్పారు. ఈ నక్షత్రం వలన కలిగే శుభ ఫలితాలను మార్గశిర మాసంలో చూడవచ్చునన్నారు. ఈ సంవత్సరంలో సంపద సమృద్ధిగా ఉంటుందనీ,... ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లగలరన్నారు. ఉగాది ప్రారంభంలో ఐంద్ర యోగం ఉంటుందనీ..,. ఇది శుభ యోగంగా పరిగణించబడుతుందని ప్రవచించారు. కనుక ఈ సంవత్సరం రాష్ట్రానికి, దేశానికి శుభప్రదమైనదని కాంక్షించారాయన. రాష్ట్రంలో అనుకున్న పనులు నెరవేరుతాయనీ..,. పాలకులు, ప్రజలు ఇద్దరూ సంతోషంగా ఉంటారనీ ప్రముఖ జ్యోతిష్య పండితులు చక్రధర సిద్ధాంతి.., విశ్వావసు నామ తెలుగు సంవత్సరాదిలో గోచరించే ఫలితాలను వెల్లడించారు.

## ఈ బిల్లును మతం కోణంలో...

ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ, వక్ఫ్ బోర్డు బిల్లుపై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అతి త్వరలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ బిల్లును మతపరమైన కోణంలో చూడటం సరికాదని బండి సంజయ్ అన్నారు. దేశం కోసం, ప్రజల కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకునేందుకు వెనుకాడబోదని స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు పేరుతో పేదలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో తనకు తెలుసని అన్నారు. కరీంనగర్‌లో ఒక పేద వ్యక్తి ఇల్లు నిర్మించుకుంటే, అది వక్ఫ్ బోర్డు స్థలమని చెప్పి అధికారులు అనుమతులు రద్దు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వ్యక్తి తాత ముత్తాతలు కూడా అదే ఇంట్లో నివసించారని తెలిపారు. ఈ బిల్లుకు మతం రంగు పులిమి కొందరు కుహనా లౌకికవాదులు, ఒవైసీ అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం తాను ఎన్నో పోరాటాలు చేశానని, ఆ సందర్భాలలో తాను జైలుకు వెళితే న్యాయవాదులు తనను బయటకు తీసుకువచ్చారని బండి సంజయ్ అన్నారు. కోర్టు ముందు చెట్లు తొలగించినందుకు, పాకిస్థాన్–భారత్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా పాకిస్థాన్ జెండాలు పట్టుకున్న వారిపై పోరాడిన సమయంలోనూ తాను జైలుకు వెళ్ళానని ఆయన గుర్తు చేశారు.

## పార్టీకి మనం అందరం...



అని చంద్రబాబు స్పష్టం చేశారు.తెలుగుదేశం పార్టీని లేకుండా చేయాలని చాలామంది చాలా ప్రయత్నాలు చేశారని, అలాంటి వాళ్లందరూ కాలగర్భంలో కలిసిపోయారని వ్యాఖ్యానించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా... టీడీపీని ఏమీ చేయలేకపోయారని, పార్టీ పెట్టిన ముహూర్త బలం అటువంటిది అని అన్నారు. చరిత్రలో టీడీపీ నాటి స్వర్ణయుగం అనే రోజులు శాశ్వతంగా వస్తాయని పేర్కొన్నారు. అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ పార్టీనే ప్రాణంగా బతికే పసుపు సైన్యానికి మనస్ఫూర్తిగా పాదాభివందనం చేస్తున్నానని చంద్రబాబు ఉద్వేగభరితంగా ప్రసంగించారు. "2024 ఎన్నికలు ఒక చరిత్రను సృష్టించాయి. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని నిలబెట్టాలన్న ఆలోచనతో కూటమిగా ఏర్పడ్డాం. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి అఖండ విజయాన్ని సాధించాం. 93 శాతం స్ట్రయిక్ రేట్ తో అద్భుత విజయం నమోదు చేశాం. ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లు ఎదురైనా కార్యకర్తలు ధైర్యాన్ని వీడలేదు. నేతలను, పార్టీని ఆర్థికంగా దెబ్బతీసి కుంగదీయాలని ఎన్నో కుట్రలు పన్నారు. ఆస్తులు విధ్వంసం చేసినా ఎవరికీ భయపడలేదు. ప్రతి కార్యకర్త త్యాగాన్ని గుర్తుంచుకుంటాం. కార్యకర్తలు హుషారుగా ఉంటే తెలుగుదేశం పార్టీకి ఓటమి అనేదే ఉండదు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## పార్టీలో యువరక్తం నింపేందుకు...

ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో జరిగిన సభలో లోకేశ్ మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ఒక సంచలనం, మొదటి గెలుపు ఒక చరిత్ర. రాజకీయాల్లో రికార్డులు కొట్టాలన్నా, వాటిని తిరగరాయాలన్నా అది మనకే సాధ్యం. మూడు అక్షరాలు తెలుగు వారి ఆత్మగౌరవం కోసం తొడకొట్టాయి. ఆ మూడు అక్షరాలే తెలుగు ప్రజల గుండె చప్పుడుగా మారాయి. అవి మూడు అక్షరాలు కాదు ఒక ప్రభంజనం... ఆ ప్రభంజనం పేరే ఎన్టీఆర్.

**కరుడుగట్టిన పసుపు సైన్యమే మన బలం.. :**

విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు 43 ఏళ్ల క్రితం తెలుగుదేశం పార్టీకి పునాది వేశారు. ఆ ముహూర్తబలం గొప్పది.. పునాది గట్టిది. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి తెలుగువాడి సత్తా ఏంటో ఢిల్లీకి తెలిసేలా చేసిన దమ్మున్న నాయకుడు అన్న ఎన్టీఆర్. 43 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం. ప్రత్యర్థులు మీద పడుతున్నా మీసం మెలేసి తొడకొట్టిన అంజిరెడ్డి తాత లాంటి కార్యకర్తలు మన ధైర్యం. మెడ మీద కత్తి పెట్టి వాళ్ల నాయకుడి పేరు చెప్పమంటే జై టీడీపీ, జై చంద్రబాబు అంటూ ప్రాణాలొదిలిన చంద్రయ్య లాంటి కరుడుగట్టిన కార్యకర్తలు మన పౌరుషం. ప్రత్యర్థులు కత్తులతో దాడి చేసి రక్తమోడుతున్నా పోలింగ్ బూత్ నుంచి కదలని మంజుల లాంటి కార్యకర్తలు మన దమ్ము. 43 ఏళ్లుగా పార్టీకి, పసుపు జెండాకు కాపలా కాస్తున్న పసుపు సైన్యానికి నా పాదాభివందనం.

**తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన ఎన్టీఆర్.. :**

సమాజమే దేవాలయం–ప్రజలే దేవుళ్లు అనే సిద్ధాంతంతో అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటివరకూ ఎన్నికష్టాలు ఎదురైనా అదే స్ఫూర్తితో పనిచేస్తున్నాం. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది అన్న ఎన్టీఆర్... దేశానికి అభివృద్ధిని పరిచయం చేసింది మన పేదల పెన్నిధి చంద్రన్న. తెలుగువారి ఆత్మగౌరవం ఢిల్లీకి తెలిసేలా చేసింది అన్న ఎన్టీఆర్... తెలుగువారిని ప్రపంచపటంలో పెట్టింది చంద్రన్న. రూ.2 లకే కిలో బియ్యం, నిరుపేదలకు పక్కా ఇళ్లు, గురుకుల పాఠశాలలు, మహిళలకు ఆస్తిహక్కు, వృద్ధాప్య పింఛను లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు దేశానికి పరిచయం చేసింది టీడీపీ. చదువుకున్న యువతకు సీట్లు ఇచ్చింది టీడీపీ. పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేసింది టీడీపీ. బీసీలకు ఆర్థిక, రాజకీయ స్వాతంత్ర్యం ఇచ్చింది టీడీపీ. కుల వివక్ష లేకుండా చేసింది టీడీపీ అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**మనకు గల్లీ తెలుసు... ఢిల్లీ తెలుసు! :**

మనకి గల్లీ రాజకీయాలు తెలుసు–ఢిల్లీ రాజకీయాలు తెలుసు. జాతీయ రాజకీయాల్లోనూ సైకిల్ ముద్ర ఉంది. కేంద్ర ప్రభుత్వాలను శాసించే అవకాశం వచ్చినా ఎప్పుడూ స్వార్థానికి వాడుకోలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం అని చెప్పిన ఏకైక పార్టీ టీడీపీ. అబ్దుల్ కలాం గారిని రాష్ట్రపతి చేయడంలో మన కృషి ఉంది. జీఎంసీ బాలయోగి గారిని పార్లమెంట్ కు మొదటి దళిత స్పీకర్ చేసింది మనమే. అంబేద్కర్ గారికి భారతరత్న రావడంలో కీలకపాత్ర పోషించాం. హైవేల నిర్మాణం, విద్యుత్, టెలికం, ఐటీ రంగాలు, డిజిటల్ పేమెంట్స్ ఇలా అనేక సంస్కరణలు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాం. తెలుగుదేశం జెండా పీకేస్తాం అని ఎంతో మంది వచ్చారు. అలాంటి వారు అడ్రస్ లేకుండా పోయారని నారా లోకేశ్ అన్నారు.

**అరాచకానికి ఎదురొడ్డాం... ప్యాలెస్‌లు బద్దలుకొట్టాం.. :**

2019 వరకూ మనం చూసిన రాజకీయం వేరు, 2019 నుంచి 2024 వరకూ మనం చూసిన రాజకీయం వేరు. అయిదేళ్లు గతంలో ఎన్నడూ చూడని అరాచక పాలనను మనం ఎదుర్కొన్నాం. మన దేవాలయంపై దాడి చేస్తే వెన్నుచూపకుండా ఎదురునిలబడ్డాం. మన అధినేత ఇంటికి తాళ్లు కడితే తాళ్లు తెంచుకొని పోరాడాం. క్లైమోర్ మైన్లకే భయపడని బ్లడ్ మనది. కామిడీ పీసులకు భయపడతామా? నలుగురు ఎమ్మెల్యేలను లాక్కొని ప్రతిపక్ష హోదా లేకుండా చేస్తాం అన్నవారికి ప్రతిపక్ష హోదా లేకుండా ఇంటికి పంపాం. ప్యాలెస్ లు బద్దలు కొట్టాం. 2024 ఎన్నికల్లో మన స్ట్రయిక్ రేట్ 94 శాతం. 58 శాతం ఓట్ షేర్. 8 ఉమ్మడి జిల్లాలు క్లీన్ స్వీప్ చేశాం. మొన్న జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 65 శాతం ఓట్ షేర్ సాధించాం. ప్రజలు ప్రజా ప్రభుత్వం కావాలని కోరుకున్నారు. వారి ఆకాంక్ష మేరకే ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని లోకేశ్ తెలిపారు.

**పేదరికం లేని సమాజమే టీడీపీ లక్ష్యం.. :**

పేదరికం లేని సమాజమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం. రూ.200 పెన్షను రెండు వేలు చేసింది మనమే. ఇప్పుడు నాలుగు వేల పెన్షన్ ఇస్తుంది మనమే. దివ్యాంగులకు రూ.6వేలు, పూర్తిగా మంచానికి పరిమితం అయిన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం. దేశంలో అత్యధిక పెన్షన్ ఇస్తుంది మనమే. దీపం పథకం కింద ఉచితంగా సుమారుగా కోటి సిలిండర్లు అందజేశాం. 16,347 పోస్టులతో త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వబోతున్నాం. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే మ్యానిఫెస్టోలో ఇచ్చిన 177 హామీల్లో పూర్తి స్థాయిలో అమలు చేసినవి 55, పాక్షికంగా అమలు చేసినవి 49 అంటే దాదాపు సగానికి పైగా హామీలు అమలయ్యాయి. మే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకారులకు రూ. 20 వేలు ఆర్థిక సాయం చేస్తాం. త్వరలోనే పీ4 కార్యక్రమం కూడా ప్రారంభం కాబోతుందని మంత్రి లోకేశ్ చెప్పారు.

**కార్యకర్తలకు తగిన గుర్తింపును ఇస్తాం.. :**

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత. ఈ మాట నేను ఊరికే అనడం లేదు. దేశంలో కార్యకర్తలకు గౌరవం ఇచ్చే ఒకే ఒక్క పార్టీ టీడీపీ. మంచి చేస్తే మెచ్చుకుంటారు. తప్పు చేస్తే తాట తీస్తారు. కోటి సభ్యత్వాలు అనేది ఒక ప్రాంతీయ పార్టీకి అసాధ్యమైన రికార్డు. దాన్ని మనం సాధించాం. కేవలం 83 రోజుల్లో కోటి సభ్యత్వాలు నమోదు చేశాం. ఏపీలో 1 కోటి 53 వేల 551 సభ్యత్వాలు, తెలంగాణాలో 1,78,041 సభ్యత్వాలు... రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మొత్తం 1 కోటి 2 లక్షల 35 వేల 857 సభ్యత్వాలు నమోదయ్యాయి. ప్రమాద బీమా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాం. కార్యకర్తల సంక్షేమం కోసం ఇప్పటివరకు సుమారు రూ.140 కోట్లు ఖర్చు చేసింది టీడీపీ. కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తాం. 2004లో ఫ్యాక్షన్ గొడవల్లో చనిపోయిన కార్యకర్తల పిల్లలను చదివించి ఉద్యోగాలు వచ్చేవరకు నిలబడింది చంద్రబాబు. పాదయాత్రలో ఫ్యాక్షన్ బాధిత కుటుంబాలను కలిశా. ప్రస్తుతం వారు వివిధ కంపెనీల్లో ఉన్నతస్థాయికి చేరారు. దేశ చరిత్రలో ఏ పార్టీలో అది జరగలేదు. అలాంటి నాయకుడు అధ్యక్షుడిగా ఉండటం మన అదృష్టం.

**పనిచేసే వారికి ప్రమోషన్ ఇస్తా.. :**

కార్యకర్తల కోసం నేను బయట ఎంత పోరాడతానో పార్టీలో కూడా అంతే పోరాడతాను. నా లక్ష్యం ఒక్కటే పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు, నాయకులను గుర్తించడమే. గ్రామ స్థాయి నాయకుడు రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదగాలి అనేది నా కోరిక. పార్టీ ముందు ఒక ప్రతిపాదన ఉంచాను. రెండు టర్మ్ లు ఒక పదవి చేసిన తరువాత పైకి అయినా వెళ్లాలి లేదా ఒక టర్మ్ గ్యాప్ అయినా తీసుకోవాలి. ఇది జరిగితే పార్టీలో కదలిక వస్తుంది. జాతీయ ప్రధాన కార్యదర్శిగా 4వసారి పనిచేస్తున్నా. పార్టీలో ప్రక్షాళన నాతోనే మొదలు పెట్టండి. యువకులకు రాజకీయాల్లోకి రావాలనే కోరిక వస్తుంది. నా స్టయిల్ ఒక్కటే... సీనియర్లను గౌరవిస్తా... పనిచేసే జూనియర్లకు ప్రమోషన్ ఇస్తా. పార్టీ మరో నలభై ఏళ్లు బ్రతకాలి అంటే కొత్త రక్తం ఎక్కించాలి. దానికి అందరి సహకారం కావాలి. పనిచేసిన వారికే పదవి అనేది నా విధానం. నాయకుల చుట్టూ కాదు ప్రజల చుట్టూ తిరిగే వారికే పదవులు ఇస్తాం. పార్టీలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేస్తాం. త్వరలోనే అన్ని నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తున్నామని లోకేశ్ తెలిపారు.

**రెడ్ బుక్ పేరు చెబితే కొందరికి గుండెపోటు.. :**

ఇక ఎక్కడికి వెళ్లినా అందరూ రెడ్ బుక్, రెడ్ బుక్ అంటున్నారు. రెడ్ బుక్ గురించి నేను మాట్లాడాల్సిన అవసరం లేదు. రెడ్ బుక్ పేరు చెప్పగానే కొంతమందికి గుండెపోటు వస్తుంది. కొంతమంది బాత్ రూంలో జారిపడి చేతులు విరగ్గొట్టుకుంటున్నారు. అర్థం అయ్యిందా రాజా. అధికారంలో ఉన్నాం అని గర్వం వద్దు, ఇగో వద్దు. అందరం కలిసి ప్రజల కోసం పనిచేద్దాం. ప్రజల ఆశీస్సులు ఉంటేనే మనం ఉంటామన్న విషయాన్ని కార్యకర్తలు గుర్తు పెట్టుకోవాలి. ప్రజల మనసు గెలిచేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు నిరంతరం శ్రమించాలని యువనేత నారా లోకేశ్ పేర్కొన్నారు.

## తెలుగు ప్రజలకు...

పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "జీవితం కష్టసుఖాల సమ్మేళనం. మన ఉగాది పచ్చడిని అందుకు నిదర్శనంగా భావిస్తాం. గత ప్రభుత్వ పాలన కష్టాలమయం కాగా, ఇప్పుడు ప్రజలకు సుఖాలను అందించే మంచి పాలన ఏపీలో ప్రజల ముంగిటనకు వచ్చింది. చైత్రమాసపు శోభతో వసంతాన్ని మోసుకువచ్చిన శ్రీ విశ్వావసు నామ ఉగాది తెలుగు లోగిళ్లను సిరిసంపదలతో పచ్చగా ఉంచాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని పవన్ కల్యాణ్ వివరించారు.

## బడుగు, బలహీన వర్గాలకు...

కానీ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పార్టీ టీడీపీ అని చెప్పారు. తెలుగుదేశం పార్టీ తనకు కన్నతల్లితో సమానమని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం చంద్రబాబు ఆధ్వర్యంలో కృషి చేస్తామని ఉద్ఘాటించారు. టీడీపీ అడ్రస్‌ను సవాల్ చేసిన వ్యక్తులే ప్రస్తుతం చరిత్రలో అడ్రస్ లేకుండా పోయారని అన్నారు. తమ కుటుంబానికి రాజకీయంగా అవకాశాలు కల్పించింది టీడీపీ మాత్రమేనని స్పష్టంచేశారు. కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ రథసారథులని... వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి...

పార్టీ అంటేనే మానవత్వం ఉన్న పార్టీ అని చెప్పుకొచ్చారు. రాజకీయ పార్టీలకు మానవత్వాన్ని అలవరిచిన నాయకులు ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్ అని అన్నారు. సొంత ఖర్చులతో గుండెను తరలించి ఓ గుండెకు ప్రాణంపోసిన నాయకుడ సోదరుడు లోకేష్ అని కొనియాడారు. 43 ఏళ్లుగా ఎన్నో త్యాగాలు చేసి పార్టీని నిలబెట్టిన నాయకులందరికీ పాదాభివందనమన్నారు. ఎన్ని ఒడిదుడుకులొచ్చినా పార్టీ జండా వదలని కార్యకర్తే తెలుగుదేశం పార్టీ బలం, బలగమని తెలిపారు. నీతి, నిజాయితీలతో తన విజన్‌తో ప్రపంచంలో తెలుగువారికి గుర్తింపునిచ్చి తండ్రి స్థానంలో పార్టీని నిలబెట్టిన వ్యక్తి చంద్రబాబు నాయుడన్నారు. 1998లో అమెరికాలోని ఇల్లినాయిస్ గవర్నర్ చంద్రబాబు గౌరవార్థం సెప్టెంబర్ 24న నాయుడు డేగా ప్రకటించడం పార్టీ కార్యకర్తకు గర్వకారణమన్నారు. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా చంద్రబాబు గురించి తెలియని వాళ్లుండరన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడైనా సరే రోజుకు 16 గంటలు పనిచేసే వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. విజన్ 2020 పెట్టిన రోజుల్లో తాను విద్యార్థిని అని... అదే 2020లోకి వచ్చేటప్పటికి తాను మహిళా అధ్యక్షురాలిగా చంద్రబాబు పక్కన కూర్చోగలుగుతున్నామంటే అదే విజనరీ అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా చంద్రబాబు విజన్ కనిపిస్తుందన్నారు. ఇప్పుడు అదే విజన్ అమరావతికి రాబోతుందన్నారు. నాలుగు తరాలు కాదు నలభైతరాల వరకు కూడా అమరావతి అంటే చంద్రబాబు, తెలుగుదేశం పార్టీనే గుర్తొస్తుందన్నారు. 2047 విజన్ పెట్టుకుని వచ్చే ఐదేళ్లలో ఏం చేయాలో, 2047కి ఏం చేయాలో ఒక ప్రణాళిక పెట్టుకుని పని చేస్తున్న విజనరీ చంద్రబాబు అని అన్నారు. రాష్ట్రంలోని బిడ్డలకు ఎలాంటి చదువు ఇవ్వాలి, ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వాలి, ప్రజలకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలి అని ప్రణాళికలు వేస్తున్నారని తెలిపారుర.పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పుట్టిన తెలుగుదేశం పార్టీకి మణిహారం చంద్రబాబు అని తెలిపారు. పేదరిక నిర్మూలన , తలసరి ఆదాయం పెంపు లక్ష్యంగా ఉగాదికి పీ4 విధానం ప్రారంభంకాబోతుందన్నారు. కష్ట, నష్టాలు, అవమానాల సమయంలో జెండాను పట్టుకున్న ప్రతి ఒక్కరికీ హోంమంత్రి అనిత కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజాసేవే పరమావధిగా...







పలు కార్యక్రమాల్లో భువనేశ్వరి పాల్గొన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మహిళలతో సమావేశమయ్యారు.

**సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యం :**

టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కుప్పంలో కార్యకర్తల సమక్షంలో జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉంది. బడుగు,బలహీన వర్గాల ప్రజల అభ్యున్నత కోసమే ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. కేవలం 9 నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతితో పాటు మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే సీఎం చంద్రబాబు పార్టీని ముందుకు తీసుకువెళ్తున్నారు. పేదలందరికీ సంక్షేమం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

**కార్యకర్తలే టీడీపీ బలం :**

ఎన్ని ఒడుదుడకులు వచ్చినా పార్టీని అంటిపెట్టుకుని, చంద్రబాబు గారికి తోడుగా నిలిచింది కార్యకర్తలే. కష్టాల్లో ఉన్నప్పుడు మాకు మనోధైర్యాన్ని ఇచ్చిందీ కార్యకర్తలే. గత ఐదేళ్ళలో ఎందరో కార్యకర్తలు పార్టీ కోసం తమ జీవితాలను త్యాగం చేశారు. కొందరు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడారు. జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు విడిచారు. కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటాం. వారికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా నిలబడతాం.

ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే పేదల ముఖాల్లో చిరునవ్వు

ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించి 28 సంవత్సరాలయ్యింది. ఎన్టీఆర్ స్ఫూర్తితో, చంద్రబాబు గారి ఆలోచనలు, సహకారంతో ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ట్రస్ట్ ద్వారా స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి ఇప్పటి వరకూ 7,531 మందికి శిక్షణ అందించాము. 2,500 మందికి ఉద్యోగాలు కూడా వచ్చాయి.

**ట్రస్ట్ ద్వారా సేవల విస్తరణ :**

ట్రస్ట్ ద్వారా సంజీవని ఆరోగ్య క్లీనిక్ లు నడుపుతున్నాము. ఈ క్లీనిక్స్ వల్ల ఒక లక్షా 60 వేల 290 మందికి ఉచితంగా వైద్య సేవలు అందించాము. ఇందుకోసం రూ. 4 కోట్ల 2 లక్షల 50 వేలు ఖర్చు చేశాం. ట్రస్ట్ ద్వారా 14 వేల 56 హెల్త్ క్యాంప్స్ కూడా నిర్వహించాము. వీటి ద్వారా 20 లక్షలమందికి ప్రయోజనం కలిగింది. ఇందుకోసం రూ. 22.43 కోట్లు ఖర్చుయింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో గండిపేటలో స్కూల్, మహిళఆ డిగ్రీ కాలేజ్ నిర్వహిస్తున్నాము. అందులో వచ్చిన లాభాలతో చల్లపల్లిలో స్కూలు నిర్వహిస్తున్నాము. విపత్తుల సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు సేవలు అందించాము. ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీరుకొచ్చాం. కేరళలో వరదలు, హుద్ హుద్, తిత్లీ తుఫాన్, కర్నూలు వరదలు, విజయవాడ వరదల సమయంలో బాధితులకు ఎన్టీఆర్ ట్రస్ట్ అండగా నిలిచింది.

**ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళలకు శిక్షణ :**

కుప్పంలో 150 మంది మహిళలకు టైలరింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, సిల్క్ దారంతో గాజుల తయారీ, చికెన్ కారీ ఎంబ్రాయిడరీ లో శిక్షణ ఇచ్చాము. త్వరలో బ్యూటీషిన్ కోర్సులు, మగ్గం వర్క్ లో ట్రైనింగ్ ఇస్తాము. మహిళలు ఉపాధి పొందడమే కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి పలువురికి ఉపాధి కల్పించాలని నారా భువనేశ్వరి అన్నారు. అంతకుముందు కుప్పంలో సీఎం చంద్రబాబు తెచ్చిన షాహీ గార్మెంట్స్ ను నారా భువనేశ్వరి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్.ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబు, రాజ్ కుమార్, శాంతారామ్, గౌని వారి శ్రీనివాసులు, సత్యేంద్ర శేఖర్, మంజునాథ్, (అప్పు )ముఖేష్, జనసేన నరేష్, సోము, నియోజకవర్గ టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

## మాదక ద్రవ్యాలకు ....
# దూరంగా ఉండండి...
### ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి నారాయణమూర్తి




కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి నారాయణమూర్తి హితవు పలికారు. కళాశాల ఆవరణలో శనివారం ఉదయం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత మాదకద్రవ్యాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తడంతో పాటు సామాజిక మరియు మానసిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నివారణపై వ్యాసరచన మరియు వకృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రదీప్ కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్యలక్ష్మి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ చంద్రబాబు, జువాలజీ అధ్యాపకులు డాక్టర్ సుదర్శనం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలసిన .....
# పెద్ద పంజాణి ఎస్ఐ



పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని పెద్దపంజాణి ఎస్ఐ ధనంజయ రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కదిరి నుంచి పెద్దపంజాణి మండల ఎస్ఐగా బదిలిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐ గా బాధ్యతలు తీసుకున్న ఆయన మొదటగా ఎమ్మెల్యేను పలమనేరు పట్టణంలోని కార్యాలయంలో పుష్పగుచ్చం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు.

## జనసేనపార్టీ ఆధ్వర్యంలో.....
# చలివేంద్రం ఏర్పాటు



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: శ్రీకాళహస్తి జనసేనపార్టీ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు వేసవికాలంలో ఎండ తీవ్రత ఎక్కువ అవుతున్న దృష్ట్యా, శని వారం శ్రీకాళహస్తి లో పాతబస్టాండ్ దగ్గర జనసేనపార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్ర మంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు దండి రాఘవయ్య, కుమార్, మాధవ మహేష్, కాపునాడు అధ్యక్షులు జనసేన పార్టీ నాయకులు n గరికపాటి చంద్ర, పగడాలప్రతాప్,అరిగిల వేణుగోపాల్పగడాల సుధాకర్,వేపూరి భాస్కర్, టి ఆర్ బాలాజీ, ఈర్ల చిరంజీవి,ఢిల్లీ బాబు,లీలాధర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ 43వ సంవత్సర ......
# ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: తెలుగుదేశం పార్టీ 43వ సంవత్సర ఆవిర్భావ సందర్భంగా జీడీ నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం పచ్చికా పల్లం పంచాయితీ లో మన ముఖ్యమంత్రి,చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఎం.ఎల్.ఏ, విప్, డాక్టర్, వి. ఎం. థామస్ ఆదేశాలతో క్లస్టర్ ఇంచార్జ్, కె. చంగల్ రాయరెడ్డి, పంచాయతీ ప్రధాన కార్యదర్శి, వెంకటేష్, బూత్ కన్వీనర్లు, జయరామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజశేఖర్ వర్మ, జయరాం రెడ్డి,పంచాయతీ తెలుగు దేశం కార్యకర్తలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# రేషన్ ఈ-కే వై సీ గడువు పెంపు..

విజయవాడ, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నవారు ఈ-కేవైసీ చేయించుకునే గడువును అధికారులు పొడిగించారు. ఈనెల 31తో డెడ్లైన్ ముగియనుండగా దాన్ని ఏప్రిల్ 30 వరకు పెంచారు. దీంతో ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తి చేయనివారు వెంటనే చేసుకోవాలని అధికారులు సూచించారు. మరోసారి గడువు పెంచే అవకాశం ఉండకపోవచ్చని పేర్కొన్నారు.



## లయన్స్ క్లబ్ అఫ్ కుప్పం వారియర్స్ ,
## బి ఆర్ డి హాస్పిటల్, వైదేహి హాస్పిటల్, చే .....
# ఉచిత గుండె చికిత్స మరియు నరాల చికిత్స శిబిరం




కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: లయన్స్ క్లబ్ అఫ్ కుప్పం వారియర్స్ , కుప్పం పట్టణంలోని బి ఆర్ డి హాస్పిటల్ లో వైదేహి హాస్పిటల్ , బెంగుళూరు చే ఉచిత గుండె చికిత్స మరియు నరాల చికిత్స శిబిరం విజయవంతం గా నిర్వహించడం జరిగింది. ఈ ఉచిత చికిత్స శిబిరాని మెడికల్ సూపరింటెండెంట్ విజయకుమారి మరియు డా. హరిత ప్రారంభించారు . 100 మందికి పైగా ఈ శిబిరంలో పాల్గొనారు . ఇందులో 10 మంది కి ఉచిత గుండె చికిత్స కు సిఫార్స్ చేసినారు .ఈ సందర్బంగా లయన్స్ క్లబ్ అడ్వైసర్ మహేష్ మాట్లాడుతూ అధికంగా జంక్ ఫుడ్ , వ్యాయామం లోపం తో ఈ మధ్య కాలంలో గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువ వునందున ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు సద్వినియాగం చేసుకోవాలని కోరారు. అదేవిదంగా ఈ ఉచిత చికిత్స శిబిరానికి సహకరించిన బి ఆర్ డి హాస్పిటల్ అధినేత డా. సురేష్ బాబు కు ధన్యవాదాలు చెప్పారు . కార్యక్రమానికి డా. మోహిత్ ,డా.నిరోషా,లయన్స్ క్లబ్ సభ్యులు సెల్వం,సెంథిల్ కుమార్, చరణ్, కృష్ణమూర్తి,శివ ప్రసాద్,హరి ప్రసాద్, చల పతి,ఏకాంబరం,పి ఆర్ ఓ లోకేష్,మణీ, అమర్,హరి మరియు వైద్య సిబంది పాల్గొన్నారు.

## ఘనంగా టిడిపి యువనేత, .....
# మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలు




శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: శ్రీకాళహస్తి టిడిపి యువనేత, 23వ వార్డు మాజీ కౌన్సిలర్, మాజీ పట్టణ యువత అధ్యక్షులు నాగమల్లి దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు,మిత్రులు, శ్రేయోభిలాషులు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. మొదటిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేయగా, కేక్‌ను నాగమల్లి దుర్గాప్రసాద్‌కు తినిపించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నాగమల్లి దుర్గప్రసాద్ పార్టీ విజయానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఇలానే పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాక్షిస్తూ, శ్రీస్వామి అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు. నాగమల్లి దుర్గాప్రసాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో టిడిపి యువ నేతలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని ఏరియా హాస్పిటల్లలోని రోగులకు పాలు, పండ్లు పంచిపెట్టారు. నాగమల్లి దుర్గాప్రసాద్ జన్మదినం వేడుకలలో భారీగా యువత, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నాగమల్లి దుర్గప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా 43వ....
# తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29:(ఎస్ ఆర్ పురం మండలం పుల్లూరు క్రాస్ రోడ్ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద 43వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, ఎస్ఆర్ పురం మార్కెట్ కమిటీ చైర్మన్ జయంతి గుండయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఎస్ఆర్ పురం మార్కెట్ కమిటీ చైర్మన్ జయంతి గుండయ్య తెలుగుదేశం జెండాను ఆవిష్కరించారు అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.. తెలుగు జాతి కీర్తిని వెలిగెత్తిన చాటిన మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని తెలిపారు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన వెంటనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని ఎన్టీఆర్ సేవలను తెలియజేశారు ఈ కార్యక్రమంలో సాఫ్ట్వేర్ బాలు, మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్ నాయుడు బాలాజీ నాయుడు మాజీ ప్రధాన కార్యదర్శి కే ఎం రవి నిరంజన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాధవ నాయుడు, మోహన్ నాయుడు నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్ గజేంద్ర సిద్దయ్య శెట్టి బ్రహ్మయ్య హిమాచలపతి రెడ్డి పుల్లూరు బాబు నోమేష్ రెడ్డి ఉమాపతి రెడ్డి టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటాచలం, జీవన్ రెడ్డి నరసింహారెడ్డి ఢిల్లీ ఉదయ్ కుమార్ నాగరాజు చిన్నబ్బ రాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరులో ఘనంగా .....
# టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
### సంక్షేమంతో సంస్కరణలను తెచ్చిన ఏకైక పార్టీ టీడీపీ.... ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: పలమనేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డ్ వద్ద నిర్వహించిన వేడుకల్లో స్థానిక శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుతా ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికారాన్ని చేపట్టి సంక్షేమానికి, సంస్కారణలకు శ్రీకారం చుట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని కొనియాడారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో బాలాజీ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, నాయకులు ఆర్బీసి కుట్టి, సోమశేఖర్ గౌడ్, నాగరాజు రెడ్డి, బ్రహ్మయ్య, గిరిబాబు, ప్రతాప్ రెడ్డి, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు, ఖాజా,చాంద్ భాషా, క్రిష్ణ మూర్తి, మదన్, శ్రీధర్, కిరణ్, బిఆర్సి కుమార్, అమరనాథ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఘనంగా తెదేపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 29: వీకోట పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి నారు. ఈ వేడుకల్లో భాగంగా తొలుతా ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికారాన్ని చేపట్టి సంక్షేమానికి, సంస్కారణలకు శ్రీకారం చుట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని కొనియాడారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా నియోజకవర్గ మండల పంచాయతీ గ్రామ తెలుగుదేశం కుటుంబ సభ్యులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సబ్ జైలు ను సందర్శించిన 12వ .....
# అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: శ్రీకాళహస్తి పట్టణంలోని సబ్ జైలును శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్ శ్రీనివాస్ నాయక్ సందర్శించడం జరిగింది. ముందుగా సబ్ జైల్లోని వంటశాలను, పరిసర ప్రాంతాలను, స్టోర్ రూమును పరిశీలించారు. అనంతరం ఖైదీలను సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. న్యాయ మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్క రిమాండ్ ఖైదీలకు తప్పక చట్టం పై అవగాహనా కలిగివుండాలి అన్నారు. అలాగే బెయిల్ గురించి , ఉచిత న్యాయం, న్యాయ చట్టం మొదలైన చట్టాలపై అవగాహనా కలిపిచారు. మీ పరిసరప్రాంతాలు పరిశుభ్రముగా ఉండాలని తెలిపారు. మీకు ఏ సమస్యవున్న ఒక అర్జీ రూపంలో ఇచ్చినచో మీ సమస్య పరిష్కరించుటకు ప్రయత్నిస్తామని తెలిపారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ ....
# రామ్మూర్తికి సన్మానం



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: అన్నమయ్య జిల్లా పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గా పురం రామ్మూర్తిని ఎన్నికైనందుకు జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ జి సభ్యులు కేవస్ బోదే శా వలి శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా బోధిషా మాట్లాడుతూ రామ్మూర్తి ఆధ్వర్యంలో రైతులకు సంక్షేమ పథకాలు అందుతాయని, రైతు అభివృద్ధి కోసం రామ్మూర్తి కృషి చేస్తారని ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## నెల్లెపల్లి లో 43వ తెలుగుదేశం పార్టీ....
# ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



గంగాధర నెల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: గంగాధర నెల్లూరు మండలం నెల్లెపల్లి గ్రామంలో చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి రోడ్డు పక్కన తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు.తెలుగుదేశం జెండాఆవిష్కరించి కేక్ కట్ చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళు లర్పించారు.. అనంతరం ఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీకి చేసిన సేవలను అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ పుష్ప రాజ్ టి ఎన్ టి యు సి కార్యదర్శి దేవరాజుల నాయుడు మాజీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ కేసి సుబ్రహ్మణ్యం వెంకట్ రెడ్డి ముని కృష్ణారెడ్డి భూపాల్ విజయ్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## వేపుల బైలు గ్రామంలో ఘనంగా .....
# తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ.

పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: అన్నమయ్య జిల్లా పీలేరు మండలం వేపు లు బైలు గ్రామంలో తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించు కొని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజవర్గ శాసనస భ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపు మేరకు,పీలేరు నియోజవర్గ బి సి అధ్యక్షు లు వసంతల రాజా టిడిపి శ్రేణులు కార్య కర్తలు నల్లారి అభిమానులు, వేపులబైలు గ్రామస్తుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగాఆయన మాట్లా డుతూ వెండితెర దేవుడిగా వెలు గుంది ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న విశ్వవిఖ్యాత గాంచిన నటసార్వభౌమ నటరత్న పద్మశ్రీ స్వర్గీయ నందమూరి తారక రామారావు రాజకీ యాల్లో అడుగు పెట్టి తెలుగుదేశం పార్టీ స్థాపించి నాలుగు గోడల మధ్య పరి మితం కాకుండా సామాన్యుని ముంగిట చేర్చారని కొనియాడారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి.....

## పౌర హక్కుల కార్యక్రమం



సదుం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 29: భారత పౌరులు ప్రతి ఒక్కరూ తమ హక్కు లను వినియోగించుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ కుమార్ అన్నారు. సదుం మం డలం ఎస్ఎంపల్లి లో శనివారం పౌర హక్కుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను పౌర హక్కుల కార్య క్రమంలో విన్నవించాలని అన్నారు. స్థానిక గ్రామస్తులు మల్లెల గిరిబాబు ఎస్.ఎం.పల్లి గ్రామానికి స్మశాన వాటిక ఏర్పాటు చేయా లని అలాగే డాక్టర్ బాబాసాహెబ్ అంబే ద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయిం చాలని అర్జీ ద్వారా విన్నవించారు.ఈ కార్య క్రమంలో ఏఎస్ఐ,జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనరసింహ,ఏఈ చంద్రశేఖర్,విఆర్ఓ, వార్డెన్ ఎస్.ఎం.డి భాష, పిసీలు,గిరి,విశ్వ నాథం,బాస్ సంస్థ అధ్యక్షులు సీతాపతి, ఎస్ఎంపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి 43 వ పార్టీ ....

## ఆవిర్భావం దినోత్సవం వేడుకలు



వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: 43 వ పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా శనివారం రోజు గంగాధర నెల్లూరు నియోజకవర్గ వెదురు కుప్పం మండలం తిరుమలయ్య పల్లి పంచాయతీ లో మొరవా గ్రామంలో 43 వ పార్టీ ఆవిర్భావం దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రాళ్ళ దేవరాజులు నాయుడు బియ్యం రవి మాజీ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ యూనిట్ ఇంచార్జ్ మాజీ సర్పంచ్ మొగి లయ్య ఎస్సీ సెల్ నాయకులు బూత్ కమిటీ కన్వీనర్ సి రాజగోపాల్ బూత్ కమిటీ కన్వీనర్ చిరంజీవి నాయుడు ఎన్ శంకరయ్య మండల యువత నాయకులు మనోహర్ నాయుడు శ్రీనాథ్ రెడ్డి జై చంద్ర బోయుడు దిలీప్ రెడ్డి రాణి చంగల్పన్ రెడ్డి మౌనిక బత్తుల యువరాజు మురళి సుబ్రహ్మణ్యం జగదన్ లోకనాథరెడ్డి జానకిరామిరెడ్డి ప్రేమ్ కుమార్ రెడ్డి సుబ్బారెడ్డి శ్రీనాథ్ రెడ్డి నేతాజీ గిరి బాలాజీ చిరంజీవి రాజయ్య కోలా చిరంజీవి కోలా సురేష్ బాబు మరియు తిరుమలయ్య పల్లి పంచాయతీ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పార్టీ ఆవిర్భావం దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది.

## వి.కోట శ్రీధర్ మెడికల్స్(సురేష్ గౌడ్)

## ఆధ్వర్యంలో.....

## రంజాన్ తోఫా కార్యక్రమం...



వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 29: పలమనేరు నియోజకవర్గం,వి.కోట మండ లం,కె.నక్కనపల్లి గ్రామంలో వి.కోట శ్రీధర్ మెడికల్స్ సురేష్ గౌడ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదర సోదరీ మణులందరికీ పవిత్ర రంజాన్ శుభాకాం క్షలు తెలుపుతూ ప్రతి ఏటా ఇస్తున్న రంజాన్ తోఫా ఆ కుటుంబాలకు ఈ ఏటా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎ.కె.హాస్పి టల్స్ డాక్టర్ తమీమ్ ఖాన్,శ్రీ లక్ష్మీ భవాని ఎంటర్ప్రైజస్ బి.యమ్.భాస్కర్,ఎన్ హెచ్ ఆర్ సి సి ఎఫ్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ జిక్రియ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పేద ముస్లింలకు రంజాన్ తోఫా

## అందించిన .....

## కుప్పం ఎడ్యుకేషనల్ సొసైటీ

కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: కుప్పం ఎడ్యుకేషనల్ సొసైటీ చేర్మేన్ బి.సి.నాగరాజ్ తన సేవా కార్యక్రమా లలో భాగంగాపవిత్ర) రంజాన్ నెలను పురష్క రించుకొని, కుప్పంలోని పేద ముస్లింలకు దాదాపు 160 కుటుంబాల కు నిత్యవసర సరకులను పంపిణీ చేశారు.ఈ సందర్భం గా మాట్లాడుతూ పేద ముస్లిం కుటుంబా లు రంజాన్ పండుగను సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలనే ఆశయంతో తమ వంతు సాయం అందించమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదర, సోదరీ మనులందరికీ బిసిఎన్ ఎడ్యుకేషనల్ సొసైటి చేర్మేన్ బి.సి. నాగరాజ్, సభ్యులు ఎన్.శాంత నాగరాజ్,సునిల్ రాజ్,సాగర్ రాజ్,రంజాన్ శు భాకాంక్షలు తెలియజేశారు.



## సమాజ సేవే లక్ష్యంగా ....

# టిడిపి ఆవిర్భావం ఎస్.సి.వి నాయుడు



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ 43వ ఆవి ర్భావ దినోత్సవం వేడుకలను శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీ నాయుడు స్వగృహంలో వైభవంగా జరిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఎస్సివి నాయుడు టిడిపి జెండాను ఆవిష్కరించా రు.ఎన్టీఆర్ చిత్రపటానికి మాజీఎమ్మెల్యేలు ఎస్సీవి నాయుడు,సత్ర వాడ ముని రామ య్య పుష్పమాలలు వేసి, పూజలు నిర్వ హించి ఘన నివాళులర్పించారు. తెలుగు దేశం పార్టీ వర్ధిల్లాలి,ఎన్టీఆర్ అమర్ రహే, చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధి ల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ ఎన్టీ రామారావు సమాజంలోని రుగ్మతల ను గుర్తించి సమాజ సేవే లక్ష్యంగా తెలుగు దేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చి పేదలకుగూడు కూడు గుడ్డ కల్పించి,సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి, అభివృద్ధి కార్యక్రమాలతో తెలుగుజాతి ఖ్యాతి నీ ఖండాంతరాలకు వ్యాపింపజేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.ఎన్టీఆర్ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ ప్రగ్గాలను చేపట్టి ఎన్నో ఆటుపోటాలు ఎదుర్కొంటూ పార్టీని నిలబెట్టిన ఘనత బాబుకి తగ్గుతుందన్నారు.నారా లోకేష్ పార్టీ కోసం సమాజ హితం కోసం పని చేస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకొని స్వార్థరహితంగా పార్టీ కోసం సమాజం కోసం పనిచేద్దామని ఎస్సివి నాయుడు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్ర వాడ మునిరామయ్య, టిడిపి నాయకులు ఎస్సీ వి దిలీప్, నారా యణ యాదవ్,ప్రకాష్ నాయుడు,మాజీ కౌన్సిలర్ లు అంజూరు సుధాకర్, ప్రసాద్ నాయుడు, సర్పంచ్ బాలాజీ నాయుడు, మాజీ సర్పంచ్ హరి నాయుడు,మాజీ ఎంపీటీసి సుబ్రహ్మణ్యం,గోగినేని భాస్కర్ నాయుడు,జానకి రామానాయుడు, ప్రభాకర్ నాయుడు,శివ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29:దశ్రీకాళహస్తి టిడిపి పార్టీ కార్యాలయం నందు శనివారం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి. అనంతరం కేక్ కట్ చేసి కార్య కర్తలకు నాయకులకు శుభాకాంక్షలు తెలిపి న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి,పార్టీ కార్యాలయం నందు జండా ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి,శ్రీకాళహస్తి నియోజకవర్గం లో జరిగిన వివిధ గ్రామాలు పట్టణాల్లో తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం సందర్భంగా జెండా ఆవిష్కరణలు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు బడుగు బలహీన వర్గాలకు చేయూతని ఇచ్చేదిశగా ఏర్పాటు చేసిన ఈ తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని రాబోయే రోజు ల్లో కూడా తెలుగుదేశం పార్టీ పేద ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్య క్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ...

## :జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్



చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్ మార్చి 29: జిల్లాకు సంబంధించి ఈవిఎంలను భద్ర పరచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా చిత్తూరు కలెక్టరేట్ లో ఉన్న ఈవిఎం గోడౌన్ ను శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్బంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ లో భద్రపర చిన ఈవిఎం యంత్రాలు,బి.యులు, సియులు, వివిప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్షుణంగా పరిశీలన చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె. మోహన్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులైన బి జె పి- అట్లూరి శ్రీనివాసులు,టి డి పి - వి. సురేంద్ర కుమార్, జనసేన- దేవినేని యశ్వంత్, వైయస్సార్సీపి- ఎన్. ఉదయ్ కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ - పరదేశి, సి పి ఏం - గంగరాజు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్ మరియు కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది మనోజ్ కుమార్,ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు!




బుచ్చినాయుడు కండ్రిగ, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 29: తెలుగువారి ఆత్మగౌరవం అనే నినాదంతో పురుడు పోసుకుని ఆరు నెలల్లోనే అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుచ్చి నాయుడు కండ్రిగ మండలంలోని తలారి వెట్టు,ఎన్టీఆర్ నగర్,నెల వాయి,టిడిపి పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ తుమ్మల కన్నయ్య నాయుడు, ఆధ్వర్యంలో శనివారం తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని బుచ్చి నాయుడు కండ్రిగ మండలంలోని,ఎన్టీఆర్ నగర్, లో టిడిపి పార్టీ సారథ్యంలో టిడిపి మండల మాజీ ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్, తుమ్మల కన్నయ్య నాయుడు ,నేతృత్వంలో పార్టీ జెండాను ఆవిష్కరించరు,ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,పి చెంగయ్య,కే సిద్దలయ్య, ఎం మునస్వామి,బి లక్ష్మయ్య,కే మధు,బి వెంకటేశ్వర్లు,పి పరందాం,రవణమ్మ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు!

## పాపం...సుజనాచౌదరీ



విజయవాడ : బీజేపీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు సుజనా చౌదరికి ఈసారి రాజకీయంగా కలసి రాలేదని అనుకోవాలి. బీజేపీలో ఉన్నప్పటికీ ఆయన కేవలం ఎమ్మెల్యేగా ఒక నియోజకవర్గానికి పరిమితం కావాల్సి వచ్చింది. రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ఆయన ఢిల్లీలో ఒక ఊపు ఊపిన నేత నేడు మౌనంగానే ఉంటున్నారు. తన నియోజకవర్గానికే పరిమితి అయ్యారు. కాదు.. కాదు.. నియోజకవర్గానికి.. అందులోనూ విజయవాడలోని ఒక ప్రాంతానికే పార్టీ పరిమితం చేసిందని చెప్పక తప్పదు. సుజనా చౌదరి సామాజికంగా, ఆర్థికంగా బలమైన నేత. టీడీపీ నుంచి బలమైన నేతగా ఎదిగినా 2019 ఎన్నికల్లో పార్టీ రాష్ట్రంలో ఓటమి పాలయిన తర్వాత సుజనా చౌదరి బీజేపీలోకి జంప్ అయ్యారు. అప్పటి వరకూ కేంద్ర మంత్రిగా ఆయన రాష్ట్రంలో పర్యటిస్తూ హల్ చల్ చేసేవారు. ఆయన తనకంటూ ఒక ఇమేజ్ ను ఏర్పరుచుకున్నారు. కానీ బీజేపీ ఆయన ను ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టినట్లయిందన్న కామెంట్స్ బలంగా వినిపిస్తున్నాయి. మొన్నటి ఎన్నికల్లో సా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి పోటీ చేశారు. పార్టీ కూడా వెంటనే ఆయన కు ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చింది. ఎంపీ టిక్కెట్ ఆశిస్తే ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చి మొదటి దెబ్బ కొట్టిందంటారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో కూటమిలోని మూడు పార్టీలూ ఒక్కసారి కూడా గెలిచిన దాఖలాలు లేవు. తెలుగుదేశం పార్టీ ఒక్కసారి గెలిచింది కానీ అదీ 1983లో మాత్రమే. అంటే ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పుడు మాత్రమే ఇక్కడ టీడీపీ గెలిచింది. 1983 తర్వాత తెలుగుదేశం పార్టీకి ఇక్కడ విజయం అనేది దొరకలేదు. అంటే నలభై ఏళ్లకు పైగానే పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ జెండా చూడటం లేదనే చెప్పాలి. 2009లో వెల్లంపల్లి శ్రీనివాస్ ఇక్కడి నుంచి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా గెలిచారు. అయితే ఇక్కడ నుంచి సుజనా చౌదరి ఎట్టకేలకు నెగ్గుకొచ్చారు. గెలిచి చూపించారు. పార్టీ నాయకత్వం కూడా ఊహించలేదంటారు. ఆ నియోజకవర్గం చరిత్ర చూస్తే ఎవరైనా అక్కడి నుంచి పోటీ చేయడానికి భయపడే పరిస్థితి ఉంటుంది. ఈ నియోజకవర్గంలో ముస్లింలే ఎక్కువగా ఉంటారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి 1972లో అసిబ్ బాషా, 1989లో ఎంకే బేగ్, 1999లో కాంగ్రెస్, 20214లో వైసీపీ నుంచి జలీల్ ఖాన్ , 20024లో కమ్యునిస్టు పార్టీ అభ్యర్థిగా నాజర్ వలి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వామపక్షాలు కూడా బలంగా ఉన్నాయి. అంటే ఆ ఓటు బ్యాంకు సుజనాకు రావడం కష్టమేనని భావించి టిక్కట్ ఇచ్చిందా? అన్న అనుమానాలు అందరిలోనూ కలిగాయి. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సుజనా చౌదరి గెలుపొందారు. సుజనా చౌదరి తాను ఎమ్మెల్యేగా గెలవడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రి పదవి రావడం ఖాయమని భావించారు. కానీ ఆయన ఆశలుతలకిందులయ్యాయి. 2014లో కమ్మ సామాజికవర్గం నుంచి కామినేని శ్రీనివాసరావుకు అప్పట్లో మంత్రి పదవి లభించడంతో అదేకోటాలో తనకు లభిస్తుందనిగట్టిగా నమ్మకం పెట్టుకున్నా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. సత్యకుమార్ కు మంత్రి పదవి లభించడంతో సుజనా తీవ్ర నిరాశకు గురయ్యారు. అప్పటి నుంచి పెద్దగా పార్టీలో యాక్టివ్ గా లేకపోవడంతో పాటు తన నియోజకవర్గానికే పరిమితం అవుతున్నారు. అలాగని పార్టీ కేంద్ర నాయకత్వాన్ని కాదనే సాహసాన్నిసుజనా చౌదరి చేయరన్నది వాస్తవం. ఎందుకంటే కేంద్ర నాయకత్వంతో పెట్టుకుంటే పాత కేసులు తిరగదోడే అవకాశముండటంతో సమయం కోసం వెయిట్ చేయడం తప్ప సుజనా చేయగలిగిందేమీ లేదు.

## తిరువూరు టీడీపీలో వర్గపోరు...

విజయవాడ :తిరువూరు టీడీపీలో గ్రూప్ రాజకీయాలు చల్లారడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, లోకల్ టీడీపీ నేతల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. స్థానిక నేత రమేశ్ రెడ్డిపై 48గంటల్లో చర్యలు తీసుకోకుంటే రాజీనామా చేస్తానంటూ ఎమ్మెల్యే అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు. ఎమ్మెల్యే బాగోతాలు బోలెడు ఉన్నాయంటూ స్థానిక పార్టీ నేతలు రచ్చకెక్కారు. తిరువూరు ఎపిసోడ్‌పై టీడీపీ హైకమాండ్ దృష్టిసారించింది. నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ వర్గపోరు పార్టీ హైకమాండ్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. స్థానిక ఎమ్మెల్యే, లోకల్ లీడర్ల మధ్య తరుచూ వివాదాలు రాజుకుంటున్నాయి. తాజాగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ రావు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి మధ్య విభేదాలు భగ్గుమన్నాయి.ఓ మహిళను రమేశ్ రెడ్డి వేధించారంటూ ఎమ్మెల్యే కొలికిపూడి తీవ్ర ఆరోపణలు చేయడంతో ఒక్కసారిగా పార్టీలో తీవ్రచర్చనీయాంశమైంది. సొంత పార్టీ నేతపైనే ఎమ్మెల్యే ఆరోపణలు చేయడంతో హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యే ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ రమేశ్ రెడ్డి వర్గం రివార్స్ అటాక్ మొదలుపెట్టారు. ఇలా స్థానిక గ్రూప్ రాజకీయాలు తిరువూరులో నాటకీయ పరిణామాలకు తెరతీశారుకూటమి పొత్తులో భాగంగా అనేకమంది టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేలకు, పార్టీ విధేయులకు కూడా దక్కని సువర్ణ అవకాశం కొలికపూడిని వరించింది. మొదటసారి ఎమ్మెల్యే అయిన కొలికపూడి ప్రభుత్వ కార్యక్రమాలతో కన్నా వ్యక్తిగత వివాదాలతోనే ఎక్కువగా వార్తలలో నిలుస్తున్నారు. నిత్యం ఏదో ఒక వివాదంతో వార్తలలో నిలుస్తూ చివరికి టీడీపీ పార్టీ అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు. అలాగే ఆ పార్టీ క్రమశిక్షణా సంఘం ముందు గతంలో హాజరై వివరణ కూడా ఇచ్చుకున్నారు కొలికపూడి.పార్టీ క్రమశిక్షణ సంఘం విచారణ చేపట్టిన తర్వాత కొలికిపూడి కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపించారు. అయితే ఇప్పుడు ఆకస్మాత్తుగా కొలికపూడి జూలు విదిల్చారు. రమేశ్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అధిష్టానానికి ఆల్టిమేటం జారీ చేశారు. రమేశ్ రెడ్డిపై తాను ఫిర్యాదు చేసి పది రోజులు అవుతున్నా పట్టించుకోలేదని, 48 గంటల్లో రమేశ్ రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యే పదవికే రాజీనామా చేస్తానని ప్రకటించి కాక రాజేశారు. ఎప్పుడూ అధిష్టానం నుంచి అక్షింతలు వేయించుకునే కొలికపూడి రివర్స్ లో పార్టీ అధిష్ఠానంపై అటాక్ చేయడం పొలిటికల్ సర్కిళ్లలో బిగ్ డిబెట్ పాయింట్‌గా మారింది.మొత్తానికి తిరువూరు ఎపిసోడ్‌పై టీడీపీ హైకమాండ్ దృష్టి సారించింది. తిరువూరులో జరిగిన పరిణామాలపై నివేదిక ఇవ్వాలని పార్టీ హైకమాండ్ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు, రీజినల్ కో ఆర్డినేటర్, విజయవాడ ఎంపీ, ముగ్గురిని కలిపి నివేదిక ఇవ్వాలని అధిష్టానం ఆదేశించింది.ఇదిలా ఉండగా ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్ ఆరోపణలను రమేశ్‌రెడ్డి తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు తనను 2 కోట్లు డిమాండ్ చేశారని ఇవ్వనందుకే కక్షగట్టారని రమేష్‌రెడ్డి చెబుతున్నారు. 3 దశాబ్దాలుగా టీడీపీ తరపున ప్రజలకు సేవ చేసుకుంటూ బతుకుతుంటే, లేనిపోని నిందలు వేస్తూ సస్పెండ్ చేయించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036